క్లుప్తంగా

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

గడివేముల: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ జమానుల్లా ఖాన్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం ఆయా శాఖల పరిధిలో వచ్చిన వినతుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని వెంటనే పరిష్కారించాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, ఏపీఓ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, ఏఈ భాస్కర్, ఆర్ఐ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల మీట్ నిర్వహిస్తున్న ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సోమవారం తెలిపారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు రూరల్: గూడూరు సబ్‌స్టేషన్‌లోని 132–33 కెవిలో కొత్తలైన్ పనులు జరుగుతున్నందున మంగళవారం కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఈఈ జేసన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ బోర్లు, బావులు, గ్రామ పంచాయతీనీటి సరఫరా కోసం తెల్లవారుజామున 4 నుంచి విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, రైతులు, వ్యాపారులు గ్రహించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాల్లో గస్తి నిర్వహించగా, మండల పరిధిలోని తుంగభద్ర నదీతీర గ్రామమైన తిమ్మందొడ్డి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నందవరం మండలం సోములగూడూరు గ్రామానికి చెందిన మూడు టాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలం దారి సమస్యను పరిష్కరించండి



రైతుల సమస్య తెలుసుకుంటున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: తమ పొలానికి వెళ్లేందుకు వీలు లేదంటూ కొంతమంది అడ్డుకుంటున్నారని, గతంలో ఉన్న దారిని పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ అనుపమను కంబదహాల్ గ్రామ రైతులు కోరారు. సోమవారం వారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. అలాగే కంబదహాల్, ఇనగండ్ల, కొండాపురం, సి.బెళగల్, బురాన్‌దొడ్డి తదితర గ్రామాల రైతులు, ప్రజలు భూ సమస్యలు, తాగునీటి సమస్యలు, మురుగు కాలువల ఏర్పాటుపై తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. సమావేశంలో ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ ఆదామ్‌బాషా, విద్యుత్, హౌసింగ్ ఏఈలు సుకుమార్, సుమంత్, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీఎం వెంకటస్వామి

సి.బెళగల్: పొదుపు మహిళలు బ్యాంక్‌ల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం వెంకటస్వామి సూచించారు. సోమవారం ఆయన స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో పొదుపు మహిళలకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పొదుపు సంఘాల్లో ఉంటూ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించేందుకు బ్యాంక్‌ల ద్వారా రుణాలను అందించనున్నట్లు చెప్పారు. వాటిని రెగ్యులర్ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలన్నారు.

భృతి.. భ్రాంతియేనా?

- ఉద్యోగం వచ్చేంత వరకు రూ.3వేల భృతి ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ
- నమ్మి ఓటేసిన నిరుద్యోగ యువత
- అధికారం చేపట్టి నెలరోజులైనా ఆ దిశగా చర్యలు తీసుకోని ప్రభుత్వం
- ఆందోళనలో నిరుద్యోగులు



కోడుమూరు రూరల్/సి.బెళగల్: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్‌లో నిరుద్యోగులందరికీ ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తానంటూ హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడుస్తున్నా నిరుద్యోభృతిపై కూటమి ప్రభుత్వం నోరు మెదపకపోవడంతో నిరుద్యోగులు, యువత తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలంటూ కోడుమూరు నియోజకవర్గంలోని యువత డిమాండ్ చేస్తోంది. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకొచ్చిన తర్వాత ఆ హామీని గాలికొదిలేసి యువతను దారుణంగా మోసం చేశారు. కనీసం ఈ సారైనా ఇచ్చిన హామీని నెలబెట్టుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని నిరుద్యోగ యువతీయువకులు కోరుతున్నారు.

63,680 కుటుంబాల ఎదురుచూపులు

నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ గ్రామాల్లో 63,680 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరిలో చదువుకున్న యువతీ, యువకులు సుమారు 21 వేలకు పైగా ఉన్నారు. వీరంతా రాష్ట్ర ప్రభుత్వం అందించే నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు.

ఎప్పుడు ఇస్తారో చెప్పాలి



నేను 2017 సంవత్సరం డిగ్రీ పాసై, 2021లో పీజీ పూర్తి చేశాను. అప్పటి నుంచి నిరుద్యోగిగా ఉన్నాను. సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీల్లో ఉద్యోగం వచ్చేంత వరకు రూ.3 వేలు భృతి ఇస్తానన్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి. 2014 ఎన్నికల హామీల మాదిరి కాకుండా త్వరితగతిన నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

–దొమ్మరి అజయ్, నిరుద్యోగి, గడివేముల

మాట తప్పకూడదు



బీఏ, బీఈడీ పూర్తి చేశాను. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నా. నిరుద్యోగులకు చంద్రబాబు ఇచ్చిన మాట తప్పకూడదు. నోటిఫికేషన్లయినా ఇవ్వాలి. లేద నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి. ఎన్నికల ముందు ప్రతి నిరుద్యోగికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున భృతిని ఇస్తామన్నందుకే ఓటేశాం. అధికారం చేపట్టి నెలన్నర అవుతోంది ఇంతవరకు ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగ భృతిపై ఎలాంటి ఆలోచనలు చేయడం లేదు.

– చిలక తులసి, నిరుద్యోగి, బురాన్‌దొడ్డి

భృతి ఊసే లేదు



సీఎం చంద్రబాబు గత ఎన్నికల్లో కూడా యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. ప్రస్తుతం కూడా సీఎం చంద్రబాబు నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలొకొచ్చి నెలరోజులవుతున్నా నిరుద్యోగ భృతిపై ఎలాంటి చర్యలు లేవు. త్వరగా నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ప్రకటన చేస్తే బాగుంటుంది.

– నవీన్‌కుమార్‌రెడ్డి, కోడుమూరు

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి



డిగ్రీ చదివి ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తు న్నా. ఎన్నికల ముందు ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగభృతి చెల్లిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులవుతున్నా ఇంతవరకు నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వలేదు. ఇకనైనా ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పిస్తారా లేక నిరుద్యోగ భృతి చెల్లిస్తారా చెప్పాలి.

– శరత్‌కుమార్, కోడుమూరు.

అందని ద్రాక్షగా నిరుద్యోగ భృతి



చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ యవతకు చేయూతగా నిలుస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. దీంతో నిరుద్యోగ భృతి కోసం వేచి చూస్తున్నాం. నేను సోషల్ వర్క్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇవ్వలేదు. ఇప్పుడైనా వస్తుందని ఆశిస్తున్నా. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.

– బందమీది నారాయణ, మీదివేముల గ్రామం, ఓర్వకల్లు(మండలం)

నిరుద్యోగ భృతి వెంటనే ప్రకటించాలి



నేను రెండేళ్ల క్రితం ఎంబీఏ పూర్తి చేశాను. నోటిఫికేషన్ల కోసం ఎదరు చూస్తున్నా. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం వచ్చాక నిరుద్యోగులకు ఉపాధి దొరికేంత వరకు నిరుద్యోగభృతి ఇస్తామని పదేపదే చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడంలేదు. భృతికి అందించేందుకు మార్గదర్శకాలను రూపొందించాలి. ఎన్నికలముందు ఎలాంటి షరతులు లేవని చేప్పిన కూటమి అందుకు తగ్గట్టుగానే భృతి అందించి నిరుద్యోగులను ఆదుకోవాలి.

– ఎర్రబం అనిల్‌కుమార్‌రెడ్డి పాణ్యం

ప్లాస్టిక్ సర్జరీలో విప్లవాత్మక మార్పులు



వైద్య బృందంతో సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ విభాగంలో ఆధునిక పరికరాలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ సర్జరీ ద్వారా శరీర భాగాలను కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చని చెప్పారు. ఆసుపత్రిలో ఈ విభాగానికి కావాల్సిన వసతులు కల్పిస్తామన్నారు. బర్న్స్ విభాగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మంజులబాయి, డాక్టర్లు విజయ్‌చంద్రమౌళి, సుదర్శన్, నిరుపమ, పద్మ విజయశ్రీ, రేణుకాదేవి, హరిచరణ్, సాయి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మినరల్ వాటర్ సౌకర్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు నాలుగు మినరల్ వాటర్ ప్లాంట్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన సోమవారం సూపర్‌స్పెషాలిటీ బ్లాక్, సర్జికల్ వార్డు, గైనిక్ వార్డు, బాలాజీ క్యాంటీన్ వద్ద టీజీవీ మినరల్ వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఏఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతాశిశు మరణాల శాతం తగ్గించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. ఆయన సోమవారం డీఎంహెచ్ఓ ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష, జిల్లా స్థాయి సమగ్ర గర్భస్రావ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. దేవనకొండ, కృష్ణగిరి, కోసిగి పీహెచ్‌సీలు, రోజా–1 యుపీహెచ్‌సీ పరిధిలో మార్చి నుంచి జూన్ మాసాలలో సంభవించిన మాతృమరణాలపై సమీక్ష జరిపారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భిణులకు సరైన సమయంలో వైద్యసేవలు అందిస్తే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. హైరిస్క్ గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సురక్షిత ప్రసవం అయ్యేలా చూడాలని ఆదేశించింది. సమావేశంలో ఎస్ఎంఓ భవానీ, డీపీఎంవో ఉమ, డాక్టర్లు సావిత్రి, రత్నకుమారి, సుప్రియ, వసంతలక్ష్మి, డీపీహెచ్ఎన్ఓ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త బంకుకు నిప్పు



గడివేములలో కాలిపోయిన బంకును పరిశీలిస్తున్న ఎస్ఐ, జెడ్పీటీసీ

గడివేముల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాసరి శ్రీనివాసులు నిర్వహిస్తున్న బంకుకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున నిప్పంటించారు. దీంతో బంకులో ఉన్న వస్తువులతో పాటు బంకు పూర్తిగా కాలిపోయింది. రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనాస్థలాన్ని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని పరిశీలించి, బాధితుడిని పరామర్శించారు.

వైభవంగా చిన్న సరిగెత్తు



సి.బెళగల్‌లో చిన్న సరిగెత్తులో చిన్న ఇమాం ఖాశీం పీరును ఊరేగిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారు జామున ప్రజలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో చిన్న సరిగెత్తులో భాగంగా చిన్న ఇమాంఖాశీం పీర్లను, గొల్లలదొడ్డి గ్రామంలో చందమామయ్య పీర్ల చావిడీలలో ఆదివారం రాత్రి భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున సి.బెళగల్లో భక్తులు చిన్న ఇమాం ఖాశీంను ఊరేగించారు. పీర్ల దేవుళ్లను తెల్లవారుజామున 4 గంటలకు మసీద్ నుంచి బయటకు తీసుకెళ్లి, కోట వీధిలో ఉన్న దస్తగిరయ్య స్వాముల దర్గాలో చదింపులు చేశారు. తెలుగు వీధిలో ఉన్న సుంతానమ్మ, పెద్ద దేవుడి, కంతమలయ్య చావిడీలలో చదింపులు చేసి, ఊరేగించి పాత బస్టాండ్‌లో సవారిని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల అనంతరం పీర్ల దేవుళ్లను మసీద్‌లలో తిరిగి ప్రతిష్టించారు. ఇనగండ్ల, బ్రాహ్మణదొడ్డి, పోలకల్, బురాన్‌దొడ్డి గ్రామాలలో కూడా భక్తులు మొహర్రం ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్ల, మునగాల, మల్లాపురం, పొన్నకల్, పెంచికలపాడు, కె.నాగలాపురం, బూడిదపాడు, తదితర గ్రామాల్లో సోమవారం పీర్లకు సరిగెత్తు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొహర్రం పండగను పురస్కరించుకుని ప్రజలు ఆయా పీర్ల చావిడీలలో కొలువైన పీర్ల దేవుళ్లను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



గడివేముల వద్ద మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షపునీరు

వర్షం.. రైతన్న హర్షం

గడివేముల: చినుకు కోసం రైతన్నలు నిరీక్షిస్తుండగా వరుణుడు కరుణించాడు. మండలంలోని గ్రామాల్లో ఇప్పటికే సాగు చేసిన పంటలు వాడుబడుతుండగా సోమవారం తెల్లవారుజాము నుంచి ఓ మోస్తరు కురిసిన వర్షం ఊపిరిపోసింది. సాగు చేయని పొలాలు పదునవ్వడంతో విత్తనాలు వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు : ఈ నెల 14న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లెపోగు మద్దిలేటి(55) చికిత్స పొందుతూ, కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన మల్లెపోగు మద్దిలేటి, జె.ఆనంద్ ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వెళ్తుండగా స్థానిక రెడ్డి డాభా వద్ద నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, పుప్పలగూడ ప్రాంతానికి చెందిన బ్రజేష్ కుమార్ సింహా ఏపీ 28 డిడబ్ల్యూ 6778 నెంబర్ గల కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. కోలుకోలేక మల్లెపోగు మద్దిలేటి మృతి చెందగా గాయపడిన ఆనంద్ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య మల్లెపోగు సావమ్మ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయండి

పాణ్యం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని, ఇందు కోసం ఐదెకరాల భూమిని కేటాయించాలని ఆర్‌వీఎఫ్ నాయకులు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్‌వీఎఫ్(రాయలసీమ విద్యార్థి ఫేడరేషన్)ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న డిగ్రీ కళాశాల తరగతి గదులు అధ్వానంగా ఉన్నాయని, పై పెచ్చులుడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. కలెక్టర్ వారంలోపు కళాశాలను సందర్శించి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీఎఫ్ వ్యవస్థాపకుడు రాజునాయుడు, రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్, రాజు, విష్ణు, కార్తీక్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలపై నోరు మెదపని పవన్‌కల్యాణ్

కర్నూలు (అర్బన్): రాష్ట్రంలో చిన్నారులపై అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదని జిల్లా భగీరథ ఉప్పర సంఘం అధ్యక్షుడు బి.సత్యన్న ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు జరిగిన సంఘటనలపై ఆవేశంగా మాట్లాడిన పవన్ అధికారంలోకి వచ్చాక ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉంటే ఒక రకంగా, అధికార పక్షంలో ఉంటే మరో రకంగా ఆయన వ్యవహార శైలి ఉందని సోమవారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలికపై అఘాయిత్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి 8 రోజులవుతున్నా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం దారుణమని మండిపడ్డారు. ముచ్చుమర్రి ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్నా హోంమంత్రి ఇప్పటివరకు బాధితులను పరామర్శించకపోవడం శోచనీయమని, ఘటనపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన కోరారు.





ఎమ్మిగనూరు రోడ్డులో నడిరోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత, ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్లో రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంత

నడిరోడ్డుపై గుంతలు..

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కోడుమూరు రూరల్: పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్‌లో, మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వర్షాలకు నడిరోడ్లపై అడుగుకు పైగా గుంతలేర్పడ్డాయి. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో కనీసం మట్టిని కూడా వేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పగటిపూట ఎలాగోలా గుంతలను దాటుకుని వెళ్లే వాహనదారులు రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు వానలు పడుతున్న సమయాల్లో, రాత్రి వేళల్లో గుంతలను గమనించకుండా వెళ్లి అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సోలార్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



కంపెనీ అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

పాణ్యం : మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో సోలార్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని, స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు తక్షణమే పరిష్కరించి పరిహారం అందించాలన్నారు. కంపెనీ అధికారులు వారితో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కంపెనీ ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

